కథానిక

# గడచిన ఘట్టాలు

కె. రామలక్ష్మి

తనెన్నోమార్లు వెళ్ళివచ్చిన జైల్లోకి రామయ్య పంతులుకూడా వస్తాడనీ, తనపక్క దిమ్మ మీదే, తనలాగే గొంగళీ కప్పుకుని పడుకుంటాడనీ ఏనాడూ వీరాస్వామి వూహించలేదు. అలా ఎప్పుడూ ఊహించనిదే జరిగింది. రామయ్య పంతులు ఏంలేనిదానికి ఆరుమాసాలు శిక్ష వేసుకు జైలుకొచ్చాడు. వీరాస్వామికి ఆశ్చర్యంవేసి మాట రాలేదు. "ఏంటి పంతులూ" అనగలిగాడు వీరాస్వామి. అంతే, మరేమీ అడగలేకపోయాడు. అంత బతుకూ బ్రతికి చెట్టుకింద సచ్చినట్లు—పంతులేంటి? ఇక్కడేమిటి? అనుకున్నాడు వీరాస్వామి.

"ఏమిటో వీరాస్వామీ, రావలసివచ్చింది వచ్చాను"అని పంతులు ముభావంగా మామూలుగా అంటే, వీరాస్వామికి కోపంవచ్చింది; పంతులేమిటి? అంత నెమ్మదిగా, నీళ్లు కార్చేయడం ఏమిటి?

'ఏంటి పంతులూ, నువ్వెలా బతికావో మరిచిపోయావా? నీకిందెందరెందరు బతికేవారో మరిచావా?—పోనీ నాకోసరం ఎన్నిమార్లు బొమ్మూరు మెట్టెక్కేవోకూడా మరిచిపోయావా?'ఆవేశంతో వీరాస్వామి ఏకరువు పెడుతుంటే రామయ్య పంతులికి నవ్వువచ్చింది.

'అంత ఆవేశం దేనికి వీరాస్వామీ. ఆర్నెల్ల పాటు రెస్టు' అన్నాడు పంతులు. ఆమాటకి వీరాస్వామి పళ్లుకొరికినంత పనిచేశాడు.

'అలాగే అను పంతులూ, అలాగేఅను కట్టుకున్న పెళ్లాం ఏమయిపోతుందనుకున్నావు? కన్న పిల్లలు ఏమయిపోతారనుకున్నావు? పేరు గొప్ప లేమయిపోతా యనుకున్నావు?' వీరాస్వామి ఆగాడే కాని అతని బుర్రలో అనేకం పరుగెడుతున్నాయి. పంతులు బతికిన బ్రతుకూ, పంతులు పెట్టినపెట్టూ ఎవరికి వస్తాయి?...

వీరాస్వామికి బాగా గుర్తు. ఆరోజు జట్కా తోలుకుంటూ గోదావరిగట్టు ఎక్కబోతూంటే పంతులెదురై బండి ఆపేడు. బండిలో కలకటేరూ, పంతులూ ఎక్కుతుంటేనే అనుకున్నాడు ఏదో ఉందని. 'వీరాస్వామీ రాజమండ్రి స్టేషనుకి పోనీ బండి. పనుంది.'అన్నాడు పంతులు. దొరవేషంలో కలకటేరు కష్టపడి ఎలాగో బండిలోకూర్చున్నాడు. కాలుస్తూన్న బీడీ ఆర్పేసి చెవిసందున పెట్టి వీరాస్వామి బండిని స్టేషనుకేసి మళ్లించాడు. 'ఆవీధిలోంచి పోనీ బండి, అక్కడింకోళ్లు ఎక్కుతారు.' అన్నాడు పంతులు. పంతులంటే గౌరవంకల వీరాస్వామి పంతులుమాట వేదంలా పాటించే వీరాస్వామి సరేనన్నాడు. వీరాస్వామికి తెలుసు ఆవీధిలో తనబండిలోకి ఎక్కపోయే కొత్తవ్యక్తి ఎవరో; అందుకే బండి తీసుకెళ్లి సరాసరి ఆ గుమ్మంలోనే ఆపేడు. పంతులుకి వీరాస్వామి తెలివితేటలకి నవ్వొచ్చింది. కలకటేరుకూడా చిన్నినవ్వునవ్వేడు. బండిదిగి లోపలికి యిద్దరూ వెళ్ళేరు. ఓ గంటో గంటన్నరో పోయాక ఆ అమ్మాయితోసహా వచ్చారు బండిలోకి. పంతులు బండిని బొమ్మూరు మెట్టకి సరాసరి పొమ్మన్నాడు. గోదావరి గాలి హాయిగా వుంది. మోటపాటలేవో గొంతులో కదలాడుతున్నా నోరునొక్కుకుని, వుండుండి కొరడా కర్ర బండిచక్రంలో పెట్టి టకటకమనిపిస్తూపోతున్నాడు. ఎవరో బండికి ఎదురొచ్చి ఆపమన్నారు. ఆ వచ్చినది కుర్రాడు. ముఖంనిండా చెమటలు. ఏదో కష్టవార్తని మోసుకొచ్చినట్లుంది అతని వాలకం. కుర్రాణ్ణి యిట్టే గుర్తుపట్టేశాడు వీరాస్వామి. 'బాబూ అబ్బాయిగారు' అంటూ బండి ఆపబోయాడు. "షికారు వచ్చి వుంటాడు, నువ్వు బండి ఆపడం ఎందుకు-పోనీ' అన్నాడు పంతులు కటువుగా. 'అదేంటి బాబూ పాపం అబ్బాయి పరిగెత్తి వచ్చినట్టున్నాడు. ఆ లుంగీ చూడు—అంచెలా చీలిపోయిందో! 'వీరాస్వామీ' ఒక్క కేకవేశాడు పంతులు. భయపడుతూ బండి

గుఱ్ఱాన్ని కదిల్చాడు వీరాస్వామి. అబ్బాయి ఏదో చెప్పాలని ముందుకి రెండడుగులు పరిగెత్తాడు. కాని లాభంలేదనుకొన్నాడో ఏమో, వెనక్కి మళ్ళిపోయాడు. వీరాస్వామి యీ జన్మలో ఆ కుర్రాడిని మరిచిపోలేడు. ఆ క్షణంలో పంతులు ముఖంచూసేవుంటే—అదీ మరిచిపోయి వుండడు వీరాస్వామి.

రాత్రి పదకొండు గంటలయింది పంతులు తిరిగి వచ్చేసరికి. కలకటేరు బొమ్మ్మారి మెట్టమీది బంగాళాలో వుండిపోయాడు. అమ్మాయీ వుండిపోయింది. పంతులు మటుకు ఒళ్ళు తెలియని స్థితిలో జట్కాలో ఎక్కి 'యింటికి' అన్నాడు. వీరాస్వామి ఆలోచించి చూశాడు ఏమయిందో. వీరాస్వామి ఆలోచనలకి ఏమీ అందలేదు. 'ఏం పంతులూ' అడిగాడు వీరాస్వామి. 'ఆ కేసుగొడవలో డబ్బు ముట్టచెప్పాలోయ్ కలక్టరుకి... డబ్బు వీరాస్వామీ, డబ్బు ఎంతపనైనా చేయిస్తుంది' నిద్రలోంచి మాట్లాడుతున్నట్లు అన్నాడు పంతులు. వీరాస్వామికి కుతూహలం హెచ్చింది.

"ఎవరికిబాబు యిస్త?" మెల్లిగా అడిగాడు.

"వాడికోయ్ కృష్ణమూర్తికి."

"వాడికెందుకుబాబూ డబ్బు?"

"ఎందుకేమిటి? వీడి లొసుగులు పైకిరాకుండాను."

"అయితే ఆ అమ్మినక్కడ వదలివచ్చేవేం పంతులూ?"

"వస్తుందిలే, కలకటేరు కారులో. ముందు నన్ను యింటికి తీసుకుపో." పంతులు విసుక్కున్నాడు. ఆ విసుగులో కోపంలేదు. వీరాస్వామికి జాలేసింది.

"ఇంట్లో ఏముంది పంతులూ, యిందాకా ఆ బిడ్డడు వస్తే పొమ్మన్నావే!" దెప్పినట్లు అన్నాడు వీరాస్వామి. పంతులికళ్ళు చింతనిప్పులు చెరిగాయి. "నోరుమూసుకు బండితోలరా" అరిచాడు పంతులు. ఇకమాట్లాడి లాభంలేదనుకొని బండితోలడంతో మునిగిపోయాడువీరాస్వామి. ఇల్లు చేరేసరికి వీరాస్వామికిపంతులిపిల్లలు అరుగుమీద కనిపించారు. పంతులు దిగి లోపలికి వెళ్ళిపోయాడు...ఆతరవాత తెలిసిందివీరాస్వామికి అమ్మకి ఒంట్లో బాగులేదనీ ఆస్పత్రికితీసుకుపోయామనీ చెప్పడానికి ఎదురొచ్చాడుపంతులు కొడుకు ఆ రోజున. పంతులు ఎంతగాబాధపడ్డాడోకూడా తెలుసు వీరాస్వామికి.

పంతులు ఆ పట్టణం వచ్చిన దగ్గిరనుంచీ తన బండే వాడుక. పిల్లలు స్కూలుకి పోడానికీ, అమ్మ ఎక్కడికేనా వెళ్ళడానికీ, పంతులుకీ అన్నిటికీ తన బండే. తాగి రోడ్లమీద వీళ్లనీ వాళ్ళనీ కొట్టినందుకూ, జట్కాలైసెన్సు గొడవలకీ, పోలీసోళ్ళతో పేచీలతోటీ వీరాస్వామి చాలాసార్లే జైలుకి వెళ్ళాడు, వచ్చాడు. అయినా పంతులి ఇంటివాడుక పోలేదు. పంతులు కుటుంబం అంటే ఒక విధమైన అభిమానం ఏర్పడింది వీరాస్వామికి. అందుకే పంతులు యిష్టంవచ్చినట్టు తిరిగి తాగి ఒళ్ళు తెలియకవున్నా యింటికి జాగ్రత్తగా తీసుకువచ్చే బాధ్యత తనమీద వేసుకున్నాడు వీరాస్వామి.

ఇంట్లో రత్నాల్లాంటి పిల్లలు, లక్ష్మీదేవిలాంటి భార్య. అయినా పంతులికి అమ్మిఅంటే మోజు. ఆ మోజుతోపాటు, పెద్దపెద్దలు పంతులుకోసం కాసుక్కూర్చునేసరికి కీర్తిప్రతిష్ఠలు! పంతులు పేరెత్తితే చేయెత్తి దండంబెట్టే రౌడీమూకలూ, పంతులంటే గజగజవణికే పెద్దలూ వున్నారు. వాళ్ళందరూ పంతులికి ఎందుకు స్నేహితులో ఎందుకు శత్రువులో, వీరాస్వామికి తెలుసు. అందుకే పంతులు వీరాస్వామి నెప్పుడూ ఒదులుకోలేదు. వూరుదోచి ఇంట్లో పోసేస్తున్నాడన్నందుకు సినిమాహాలు దగ్గిరి లాయరుని చితకతన్నాడు వీరాస్వామి. పంతులూరు దోచి ఇంట్లో పడేస్తే ఇల్లాలు భూమీ పుట్రా తెగనమ్మి పిల్లలకి అచ్చటా ముచ్చటా తీర్చే అవసరం ఏముంది? ఆ యిల్లాలు కంటతడి పెట్టనిరోజు కనిపించలేదు వీరాస్వామికి.

ఈ క్షణంలో పంతులు తనతోపాటు కటకటాల్లోకి రాడానికి కారణం ఏమిటో—వూహకి అందలేదు వీరాస్వామికి. ఆలోచించాడు; ఆ ఆలోచనలు అంతం కాడంలేదు. తనుకోపంవచ్చి పొగరుబోత్తనంతోటీ చావ చితకకొడితే, జైలునపడకుండా ఈ పంతులెన్నిసార్లు చూశాడు!

"పంతులూ, ఏంజరిగింది?" వీరాస్వామి అడిగాడు జైలులో పంతులు స్థిమితపడ్డాక.

"ఆ ఏంలేదు. కృష్ణమూర్తి తనకి డబ్బిచ్చాడని కలక్టరు ఒప్పుకోలేదు. మధ్య నేను యిరుక్కు-

న్నాను. నన్ను నమ్మించి యిలా చేశాడు." అన్నాడు పంతులు.

"మరియితే అమ్మిని సాక్ష్యంవెయ్యకపోయావ్వా? రెండు రోజులుంటే నేనూ బైటపడేవాణ్ణేకదా!" వీరాస్వామి అమాయికత్వానికి నవ్వొచ్చింది పంతులికి.

"ఎందుకు వీరాస్వామీ నువ్వూ అమ్మీ ఏం చేస్తారు? డబ్బిచ్చింది నీకేం తెలుసు?"

"తెలియదా ఏం? మరీ చెప్పొచ్చావు" వీరా స్వామి విసుక్కున్నాడు.

రాత్రి మగతనిద్రలోవుండగా పంతులువిన్నాడు —"నేచెప్తాగా ఆ కృష్ణమూర్తి పని, పులుసులోకి బొబికల్లేకుండా తన్నించేత్తాను. ఏమిటో అను కున్నాడు!" పక్క ఖైదీతో చెపుతున్నాడు వీరా స్వామి. అన్నంతపనీ చేస్తాడు వీరాస్వామి అని పంతులుకి తెలుసు.

అలాగే జరిగింది కూడా. రామయ్యపంతులు జైలుకి వెళ్ళిన రెండు రోజుల తరువాత వీరా స్వామి విడుదలయాడు. కాని, ఆ రాత్రికే మళ్ళీ తీసుకొచ్చేశారు అతన్ని. కృష్ణమూర్తిని చావ చితకకొట్టడమే కాకుండా, పంతుల్ని జైల్లోనుంచి రానీరా నీ పనిపడతా, నంటూంటే పోలీసు పెద్దలే ఆశ్చర్యపోయారుట.

వీరాస్వామికి తనమీద యింత అభిమానం ఎందుకో పంతులికి తెలియదు. కాని వీరాస్వామికి తెలుసు-పంతులివల్లే తానీనాడు బాగా తింటున్నా నని. అందుకే ఆ విశ్వాసం. ఇది చూస్తే పంతులికి వింత. తనవల్ల ఎన్నో విషమ పరిస్థితులనుండి తప్పించుకొని, తనకి అవసరం వచ్చినప్పుడు మొహ మాటం లేకుండా సహాయాన్ని అర్థించి బాగు పడ్డాడు కలక్టరు. పంతులికే కలక్టరు అవసరం వచ్చినప్పుడు చిన్న మెత్తుకూడా సహాయం లేదు సరికదా గుమాస్తాగాడు పోతే పోతాడన్నాడు. అవును. కలక్టరుకీ గుమాస్తాకీ అంత తేడా! ఆ సంగతి యిప్పుడు తెలిసింది పంతులికి. కాని చేతులు కాలేక ఆకులుపట్టుకొని లాభం?

జైలు బాగానేవుంటుంది అలవాటైతే—అను కున్నాడు పంతులు. నిజమే కూడా. చాకలి సరన్న, యింకా ఎందరో తనకి పనిచేసినవాళ్లు అక్కడున్నారు. అవతలనుంచి తనకేం కావలసినా




తెచ్చియిచ్చేవాళ్లు జైల్లోనే వున్నారు. అన్నీ వున్నా అది జైలే. తను శిక్షనే అనుభవిస్తున్నాడు. పంతులికి ఈ విషయం బాధకల్గించినా, భవిష్యత్తుని తలుచుకొని హాయిగానేవుంది అతని అంతరాత్మ. ఇంతటితో తన జీవితంలో ఒక ఘట్టం ముగుస్తుంది. తనుమళ్ళీకొత్తజీవితం ప్రారంభిస్తాడు. తనకి పిల్లలు న్నారు. ఉండటానికి కొంచెం ఆస్కారంవుంది. అంత కంటె ఏంకావాలి? తనపిల్లలు తననితల్చుకు సిగ్గుపడ తారా? తన సంఘంలో మళ్ళీ తలఎత్తుకు తిరగ లేడా? తను ఉద్యోగం చెయ్యకపోతే గడవదా? అన్న ఆలోచనలు అప్పుడప్పుడూ వచ్చినా అవి నిలచినది క్షణ మాత్రమే. తనపిల్లలకి తను అన్యా యం చేయ్యలేదు. తను అన్యాయంగా సంపా

దించినదానిలో ఏ ఒక్కటికానీ వాళ్ళకోసం వినియోగించలేదు. అదే తన తృప్తియిప్పుడు. అన్యాయార్జనలో పెరిగితే, వాళ్ళు నాశనమయి పోయే వారు అన్న ఆలోచనకి రామయ్య పంతులు నవ్వుకున్నాడు.

"పంతులూ ఆరోజు అబ్బాయి అట్టాఅట్టా పరుగెత్తుకొస్తుంటే కళ్లు మూసుకుపోయాయే నీకు!" అన్నాడు వీరాస్వామి.

ఇంకో సారైతే కళ్ళు ఎర్ర చేసేవాడే. ఇప్పుడు మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఊరుకుంటే వూరుకొనేతత్వంకాదు వీరాస్వామిది.

"ఏంటి పంతులూ, ఇందరికిన్ని సహాయాలు చేసావే. ఒక్కళ్లు నిన్నాదుకోలేదు?" రెట్టించాడు. పంతులు దీనికీ సమాధానం చెప్పలేదు. ఏం సమాధానం చెప్తాడు?

"పంతులూ, యిక్కడెలాఉంది?"

"బాగానేఉంది వీరస్వామి కొంచెం ప్రశాంతంగా ఆలోచించుకోవచ్చు."

"వేటినిగురించి పంతులూ ఆలోచన? ఇన్నాళ్లూ ఏమి ఆలోచించి చేశావు అలాగ?"

"అదీ నిజమే వీరస్వామీ; హాయిగా కాలం గడిచిపోతూంటే ఆలోచించడానికి అవసరంలేదు. కష్టంవచ్చి విషమ పరిస్థితులలో పడ్డప్పుడే ఆలోచనలు."

"ఆ ఆలోచించావులే పంతులూ! బుర్ర పాడుకోకు. ఎందుకొచ్చిన ఆలోచనలు! అంతోటి పెద్దోళ్ళతో అంతంతస్నేహాలుచేస్తే ఇంతేఅవుతుందనుకో పంతులూ." వీరస్వామి పంతులుకేసి చూశాడు. పంతులెక్కడో ఆలోచిస్తున్నాడు.

"పెద్దోళ్ళకి విశ్వాసం ఏంటి? స్నేహం ఏంటి? డబ్బొస్తున్నకొద్ది పీటికిదూరంఅయిపోతారు పెద్దలు ఇదంతా నే చెప్పాలేంటి?" వీరాస్వామి ఆగేడు. పంతులు పడుకోందుకి దిమ్మమీదిగొంగళీ సద్దేడు.

"ఉండు పంతులూ, అవతల సరయ్య వున్నాడు. కాస్త కాళ్లు రాయమంటా" అంటూ లేచాడు వీరాస్వామి. స్వర్గంలో రంభాసాన్నిధ్యంలా, జైలులో శరీర సౌఖ్యాలు! రామయ్య పంతులు తనలో తను అనుకున్నాడు. సరయ్య కాళ్లు రాస్తున్నాడు. వీరాస్వామి కబుర్లూ చెప్తున్నాడు. పంతులు ఆలోచనలుమటుకు జైలు కటకటాలుదాటి ఎక్కడెక్కడో పయనిస్తున్నాయి. పిల్లలూ, యిల్లూ, తనగడచిన జీవితమూ అన్నీ... ఒకదానివెంబడి ఒకటిగా సాగిపోతున్నాయి. పంతులు దృష్టిలో యిప్పుడు మిగిలినది ఒక్క పిల్లలే. ఇంకేంలేదు. వాళ్లకోసమే తను మళ్ళీ బయటికివచ్చి బతుకుదాం అనుకుంటున్నాడు. వార్డెను రహస్యంగా తెచ్చియిచ్చిన బీడీ, అతి రహస్యంగా కాలుస్తూ ఆనందిస్తున్నారు—సరయ్యా వీరాస్వామీ. "ఇవీ యిక్కడ పంతులుండబట్టి పచ్చాయి, లేకుంటే ఆ వార్డరు మనకంటే తెస్తాడా?" అంటున్నాడు వీరాస్వామి.

"ఎక్కడుంటే నేటి? పంతులుపంతులే. ఒక్కోక్క గ్రహంపడితే అట్టా పీడిత్తాది. ఏమంటావు వీరాస్వామీ."

"నిజమే. లేకుంటే పంతులేంటి? జైలేంటి? కర్మకాకుంటే" వీరాస్వామి దీర్ఘంగా నిట్టూర్చాడు. ఇవన్నీ పంతులికి సగం నిద్రలో; యోగనిద్రలో—విన్పిస్తూనే వున్నాయి. తెల్లారడంకోసం చూస్తూ పడుకున్నాడు.

---

తోడేళ్లకి అధిపతి చేయబడిన ఒక తోడేలు "ప్రతి తోడేలూ తను వేటాడిన జంతువులను ఒకచోట పెట్టి, అన్నీ కలిసి సమానంగా పంచుకొని తినాలి. అప్పుడే ఆకలి బాధవల్ల తమలో ఒకరినొకరు తినేయడం జరగదు" అంటూ చట్టం చేసింది. అది విన్న గాడిద ముందుకువచ్చి "యింత ఉత్తమమైన ఆలోచన తోడేలు మెదడులోంచి వచ్చిందిగాని, నిన్న నువ్వు వేటాడిన జంతువుని నీ గుహాలో ఎందుకు దాచుకున్నావు? అందరూ పెట్టిన చోటే నువ్వూ పెట్టకూడదూ?" అని అడిగింది. నిజం బైటపడగానే సిగ్గుపడి, తను చేసిన చట్టాన్ని రద్దుచేసింది తోడేలు.

—(ఏసబ్ నీతి కథావళినుండి.)